## శివయ్య సేవలో

# పొంగులేటి సోదరులు



తెరాస రాష్ట్రనాయకులు ఖమ్మం మాజీ పార్లమెంట్ సభ్యులు పొంగులేటి శ్రీనివాస రెడ్డి సోదరులు కుటుంబ సమేతంగా శ్రీశైలంలోని శ్రీ భ్రమరాంబ సమేత మల్లిఖార్జున స్వామిని దర్శించు కున్నారు. స్వామి వార్లకు ప్రత్యేక అభిషేకాలు చేసి తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఉమ్మడి ఖమ్మం జిల్లా ప్రజలందరూ సుఖసంతో షాలతో వర్ధిల్లాలని స్వామివార్లను వేడుకున్నట్లు పొంగులేటి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు.

**ఖమ్మం, నవంబర్ 21, కెరటం న్యూస్**



# శభాష్ రంజిత్..

## చిన్నారి కిడ్నీ ఆపరేషన్‌కు రూ.10వేలు ఆర్థిక సాయం

**ఖమ్మం, నవంబర్ 21, కెరటం న్యూస్**



లాక్‌డౌన్ కష్టకాలంలో, మొదటి దశ కరోనాతో ప్రపంచ మంతా అతలాకుతలమై ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని బిక్కుబిక్కు మంటూ కాలం గడుపుతున్న వేళ తన సేవా కార్యక్రమాలతో ప్రజలకు చేతనైనంత మేరకు అండగా నిలిచిన నందమూరి బాలకృష్ణ అభిమాన సంఘం నాయకులు, నల్లమల రంజిత్ మరో మారు తన దానగుణాన్ని చాటుకున్నారు. సీనియర్ ఎన్టీఆర్, బాలకృష్ణ, హరికృష్ణ పాటలకు డ్యాన్స్ చేస్తూ కుటుంబాన్ని పోషించు కుంటున్న నందమూరి కుటుంబ అభిమాని నరేష్ కుమార్తె ఆపరేషన్‌కు రూ. 10వేలు ఆర్థిక సాయం చేసి ఆదుకున్నారు. ఖమ్మం జిల్లా పెద్దతండాకు చెందిన నరేష్‌కు డ్యాన్స్ చేసి రూపాయి సంపాదిస్తేనే పూటగడిచేది. ఈ పరిస్థితుల్లో ఇటీవల పాపకు ఆరోగ్యం బాగలేక పోవడంతో హాస్పిటల్‌కు తీసుకెళితే కిడ్నీలో రాళ్లు ఉన్నాయనీ, ఆపరేషన్ చేయాలని వైద్యులు చెప్పడంతో చేతిలో డబ్బులేక నరేష్ కుటుంబం ఆందోళన చెందింది. పూటగడవడానికే కష్టంగా ఉన్న పరస్థితుల్లో నల్లమల రంజిత్ దగ్గరకు వచ్చి విషయం చెప్పడంతో తాను ఎంతో కొంత సాయం చేస్తానని మాటిచ్చి, ఆ మాట మేరకు సోమవారం నరేష్ ఇంటికి వెళ్లి రూ. 10వేలు అందజేశారు. గతంలోనూ లాక్‌డౌన్ వేళ వలస కూలీలను ఉత్తర ప్రదేశ్, బీహార్, చత్తీస్‌గడ్, మహారాష్ట్ర తదితర రాష్ట్రాలకు వెళ్లేందుకు రవాణా సౌకర్యాలు లేక కుటుంబాల దగ్గరకు వెళ్లలేక, తీవ్రంగా ఇబ్బందులు పడుతున్న వేళ నల్లమల రంజిత్ తన సేవా కార్యక్రమాలను నిర్వహించారు. తమ సొంత వాహనాల్లో పలువురు వలస కూలీలను వారి స్వగ్రామాలకు చేర్చి వారి కుటుంబాల్లో ఆనందాన్ని చూశాడు. దీంతోపాటు జిల్లాలో అనేక మంది వివిధ సమస్యలతో వచ్చే వారిని తన చేతైనంత మేరకు సేవా కార్యక్రమాలు చేస్తున్నాడు. ఎవరు ఎప్పుడు అన్నా అని అంటే నేనున్నానంటూ వివిధ రకాలుగా అండగా నిలుస్తున్న రంజిత్ సేవలను శభాష్ అంటూ అభినందనలు తెలుపుతున్నారు. భవిష్యత్తులో మరిన్ని సేవలు అందించాలన్నారు.